పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. మంగళవారం వేలేరుపాడు పర్యటనకు వెళ్తూ మార్గ మధ్యలో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్‌పి సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. భవన నిర్మాణ పనుల వివరాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బయల్దేరి వేలేరుపాడు వెళ్లిపోయారు. ఆయనతో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ.. గాడిన పడేనా..!

ప్రజా సమస్యలపై సిబ్బంది స్పందించరు.. సమాధానం ఇవ్వరు

ఏ సమస్యపై వెళ్లినా సర్వర్ డౌన్.. సర్వేల పనంటూ సమాధానం

పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాలకే రారు

కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల నుంచి ఏఒక్క సేవా అందని దుస్థితి

రేషన్‌కార్డుల అంశంలోనూ జనాలకు ముప్పతిప్పలు

రెండు జిల్లాల్లో దాదాపు 938 సచివాలయాలు, 8 వేలకుపైగా ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల పని తీరుపై జనాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయాలకు పనుల మీద వెళ్తున్న ప్రజలను అక్కడ కనీసం పట్టించుకునేవారే లేకుండాపోతున్నారు. పనులపై వెళ్లిన వారిని ఎందుకొచ్చారో కనీసం అక్కడి ఉద్యోగులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలపై వెళ్లిన జనం అడిగినా సరిగా సమాధానం చెప్పని పరిస్థితి ఉంది. ఫోన్లు చూసుకుంటూ చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఏ పనిపై వెళ్లినా సర్వర్ పని చేయడం లేదనే సమాధానాలతో సరిపెడుతున్నారు. దీంతో జనం గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. సచివాలయాల్లోని ఉద్యోగులను సక్రమంగా పని చేయించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాలకు సరిగా రావడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు పరిస్థితి తయారైంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలోనూ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విఆర్‌ఒ, ఎఎన్ఎం, ఫిషరీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఇలా 11 మంది ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 938 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 8,468 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు, రేషన్‌కార్డుల సమస్యలు, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి వందలాది సేవలను సచివాలయాల్లోనే జరిగేలా ప్రభుత్వం ఈ వ్యవస్థను తెచ్చింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం ఎటువంటి సేవలూ అందడం లేదు. మీసేవా కేంద్రాల్లోనే జనం తమ పనులు చేసుకుంటున్నారు. ఎందుకంటే గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్తే అక్కడి ఉద్యోగులు సరిగా స్పందించకపోవడమే కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం నూతన రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియలో సైతం జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్ పని చేయడం లేదని రోజులు తరబడి జనాన్ని సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారు. దీంతో సచివాలయాల్లో ఉద్యోగుల పని తీరుపై ఎటువంటి పర్యవేక్షణా లేకుండాపోయింది.

సర్వేలతోనే సరి.. ప్రజా సమస్యలు గాలికి

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని చెప్పొచ్చు. సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం సర్వేలకు మాత్రమే ఉపయోగిస్తోంది. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఉద్యోగులు పని చేయడం లేదు. ఇదే అదునుగా ఉద్యోగులు అసలు సచివాలయాల్లోనే ఉండటం లేదు. అదేమని అడిగితే సర్వేకు వెళ్లారని సమాధానం ఇస్తున్నారు. చాలామంది ఉద్యోగులు అసలు విధులకు రాకుండా సర్వేల పేరుతో తప్పించుకుంటున్నారనే విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గర చేసేందుకు తెచ్చిన సచివాలయ వ్యవస్థ పూర్తిగా గాడితప్పిన పరిస్థితి ఉంది. సచివాలయాలకు డిడిఒగా పంచాయతీ కార్యదర్శి ఉంటారు. పంచాయతీ కార్యదర్శులు వారంలో సగం రోజులు కార్యాలయాలకే రావడం లేదని తెలుస్తోంది. పెన్షన్లు ఇచ్చే రోజు ఉద్యోగులందరూ పాల్గొనాలనే నిబంధన ఉన్నప్పటికీ చాలామంది పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం లేదు. రెండు, మూడు పంచాయతీలకు ఇన్‌ఛార్జులుగా ఉండటంతో ఎవరైనా అడిగితే ఎక్కడో ఒకచోట ఉన్నట్లు చెబుతూ తప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. దీంతో సచివాలయాల ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే చర్చ నడుస్తోంది. సచివాలయాలకు వస్తున్న ప్రజల పట్ల అక్కడి ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు మారాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా సచివాలయ వ్యవస్థను చక్కదిద్దాలని అంతా కోరుతున్నారు.

పారిశుధ్యం పూర్తిస్థాయిలో మెరుగుపడాలి

మార్పు నేటి నుంచి మొదలుకావాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

మాట్లాడుతున్న కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న 30 రోజుల్లో ఏలూరు నగరంలో పారిశుధ్యం పూర్తిస్థాయిలో మెరుగుపడాలని, మార్పు నేటి నుంచి మొదలు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో పారిశుధ్యం, పన్నుల వసూళ్లు, పౌరుల ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశుధ్యానికి ఎంతోమంది సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు, వాహనాలు ఉన్నప్పటికీ ఏలూరు నగరంలో ప్రతీ చోటా అపరిశుభ్రం కనిపించడం శోచనీయమని, ఇటువంటి పరిస్థితి తప్పనిసరిగా మారాలన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి 30 రోజులు సమయం ఇస్తున్నానని, నగరంలో రోడ్లపై ఎక్కడా చెత్త కనపడకుండా సంపూర్ణ పారిశుధ్యం స్పష్టంగా కనిపించాలని, 30 రోజులు అనంతరం పారిశుధ్య విధుల ప్రగతిలో చివరి రెండు స్థానాలలో నిలిచిన వారిని తొలగించడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. నగరంలో చెత్త ఎక్కువగా వచ్చే కళ్యాణ మండపాలు, మార్కెట్లు, హోటల్స్, రెస్టారెంట్లు, వాణిజ్య దుకాణాల వాళ్లు చెత్తను నగరపాలక సంస్థ వాహనాలకు అందించాలని, అలాకాకుండా రోడ్లపై వేసి అపరిశుభ్ర పరిస్థితులు కల్పించే వారికి నోటీసులు జారీచేయాలని, చెత్తను రోడ్లపై వేసే వారికి నోటీసులు జారీ చేసి పెనాల్టీలు విధించాలన్నారు. ఇంటిలోని చెత్త, హోటల్స్, కళ్యాణమండపాలు, వాణిజ్య సముదాయాలు, తదితర ప్రాంతాలలో చెత్తను రోడ్లపై వేసేవారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వారికి పెనాల్టీ విధించాలని, ఈ విషయాన్ని ప్రతీ వీధిలోనూ ప్రజలకు తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. సేకరించిన చెత్తను నివాస ప్రదేశాలలో కాక నగరానికి దూరంగా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. నగరంలో వీధి దీపాలు వెలగడంలేదు, తాగునీరు రావడంలేదు, పారిశుధ్యం సరిగా లేదని తనకు పలు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, పౌర సేవలపై ప్రజలకు ఫిర్యాదు వ్యవస్థ ఏమైనా ఉందా అని మున్సిపల్ కమిషనర్‌ని కలెక్టర్ ప్రశ్నించగా 08812-232101 నెంబర్‌తో ప్రత్యేక ఫిర్యాదు నమోదు విభాగాన్ని ఏర్పాటుచేయడం జరిగిందని వివరించారు. ఈ ఫోన్ నెంబర్ నగరంలోని ఏ ఒక్క పౌరుడికి తెలియదని, ఈ ఫోన్ వివరాలను నగరంలోని ప్రతీ కూడలిలోనూ, ప్రతీ వార్డ్ సచివాలయంలోనూ ప్రముఖంగా కనిపించేలా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నగరంలో రోజుకు రెండుసార్లు చెత్తను శుభ్రం చేయాలని, పారిశుధ్య పరిస్థితులపై తాను ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలిస్తానని, విధులలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆస్తి, తాగునీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై సమీక్షిస్తూ పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, గత 5, 10 సంవత్సరాల నుంచి పన్నులు చెల్లించని వారి వివరాలు సేకరించి, వారు పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పన్నుల సొమ్ములో పరిపాలన ఖర్చులు పోగా, మిగిలిన సొమ్ములతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. నగరంలోని కృష్ణ కాలువలో ప్రజలు వ్యర్థాలు పడివేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ విధానం, అమృత్-1, అమృత్-2, పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, అదనపు కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి.సురేఖ, మున్సిపల్ ఇంజనీర్ జి.సురేంద్రబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, కార్యాలయ మేనేజర్ మూర్తి, రెవెన్యూ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

కొల్లేరు ప్రజల ఉపాధి కాపాడాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీలు అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదించి కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పర్యావరణంతోపాటు కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని, కొల్లేరు ప్రజలకు నష్టం కల్గించే ఎకోసెన్సిటివ్ జోన్‌ను ఉపసంహరించుకోవాలని, కొల్లేరు ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన కొల్లేరు ప్రజల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రజాసంఘాలు, కొల్లేరు ప్రాంత నాయకులు, రైతుసంఘాలు, సామాజికవేత్తలు పాల్గొన్నారు. కొల్లేరు ప్రజల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రిటైర్డ్ ఐఆర్ఎస్, కొల్లేరు గ్రామాల అభివృద్ధి సంఘం అధ్యక్షులు చాగంటి సంజయ్, నేత పల్లెం ప్రసాద్, కొల్లేరు ప్రాంత మహిళా నాయకురాలు ఘంటసాల వెంకటలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, కొల్లేరు రైతుసంఘం నాయకులు నంబూరి శివాజీరాజు, నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు), ప్రముఖ సామాజికవేత్త ఆర్.మణిసింగ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సాలి రాజశేఖర్, మాజీ ఎంపిపి మోరు సుబ్బారావు, కొల్లేరు ప్రాంత నాయకులు మండల కొండలరావు, దళిత బహుజన నాయకులు నేతల రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

కొల్లేరును 5 నుండి 3వ కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల హామీలు అమలు కాలేదన్నారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారని చెప్పారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల్లోని చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారని విమర్శించారు. 5వ కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువుల ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలను, ఇందులో 7100 ఎకరాల్లో సొసైటీ చెరువులు, 14,800 ఎకరాల్లో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారని గుర్తు చేశారు. దీంతో కొల్లేరు ప్రజల పరిస్థితి గట్టునపడ్డ చేపల్లా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట నింపుకునేందుకు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వెళ్తున్నారని చెప్పారు. ఉపాధి లేక కొల్లేరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొల్లేరులో రెగ్యులేటర్లు కడతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారిపోయాయన్నారు. ప్రస్తుతం కొల్లేరు తుమ్మ చెట్లు, కిక్కిసతో నిండిపోవడంతో చేపల వేటకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఫారెస్ట్ అధికారుల వేధింపులు, లంచాలు పెరిగిపోయి కొల్లేరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల ఉపాధికి నష్టం కలిగించేలా కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్లగా కొల్లేరు పేదల సాగులో ఉన్న 15 వేల ఎకరాల్లో చెరువులు ధ్వంసం చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెరువులు పూర్తిగా ధ్వంసం చేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడం వల్లే సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పునిచ్చిందన్నారు. కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలు పరిష్కరించడం మానేసి కొత్త సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. ఐదో కాంటూరు నుండి పది కిలోమీటర్లకు సున్నిత పర్యావరణ ప్రదేశం పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేసి పూర్తిగా అటవీశాఖ చేతుల్లో పెట్టబోతున్నారని వివరించారు. ఏలూరు జిల్లాలో కొల్లేటి ప్రాంతమైన నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాల్లోని 89 గ్రామాలపై ఈ ప్రభావం పడనుందన్నారు. ఇలాంటి దారుణమైన 26 నిబంధనలతో కొల్లేరు చుట్టుపక్కల 89 గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో ఎపి చేతివృత్తిదార్ల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, కొల్లేరు ప్రాంత నాయకులు తాతపూడి రామ్‌చంద్, ఎం.శివప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కెఎస్ఎన్.మూర్తి, ఎస్‌వి.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, కెవిపిఎస్ నాయకులు కాకర్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మలాథియాన్ పిచికారీ

జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా మలాథియాన్ పిచికారీ చేస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. స్థానిక శాంతినగర్, అమీనాపేట, ఎన్ఆర్‌పేట తదితర హాస్టళ్లలో మలాథియాన్ స్ప్రెయింగ్ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు ఎక్కువగా ఉంటాయన్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా తదితర జ్వరాలతో విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. అందువల్లే ముందు జాగ్రత్త చర్యగా ప్రతి హాస్టల్‌లో అన్ని గదుల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్నామని, దీనికి హాస్టల్ వార్డెన్లు సహకరించాలని కోరారు. ఏ విద్యార్థి అయినా జ్వరంతో బాధపడుతుంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

ఐద్వా మండల మహాసభలో జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి

మాట్లాడుతున్న శ్యామలారాణి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహిళలు హక్కుల కోసం పోరాటాలు ఉధృతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి అన్నారు. ఐద్వా జంగారెడ్డిగూడెం మండల మహాసభ వి.అరుణకుమారి అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. శ్యామలారాణి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో మద్యం విచ్చలవిడిగా పారుతోందని, తాగునీరు మాత్రం దొరకడం లేదని అన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా సూపర్ సిక్స్ పథకాలు తక్షణం అమలు చేయాలన్నారు. అధిక ధరలు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు జి.వెంకట్రావు సౌహార్థ్ర సందేశం ఇచ్చారు. ఈ మహాసభలో సుమారు వంద మందికిపైగా మహిళలు పాల్గొని తమ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో యాగటి సీత, ఎం.మంగ, జి.దీప, జి.మరియమ్మ, డి.వాణి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందేలా చర్యలు తీసుకోండి

మంత్రి నిమ్మలకు నిర్వాసితుల వినతి



మంత్రికి వినతిని అందజేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా విఆర్ పురం మండలం రామవరం గ్రామ నిర్వాసితులు మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో 266 కుటుంబాలకు గాను 104 కుటుంబాలకు పరిహారాలు ఇప్పటికీ అందలేదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు న్యాయం జరగడం లేదని, సత్వరమే తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

జామాయిల్ పంట కటింగ్ ఆర్డర్ ఇవ్వాలి

కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వాలి

వ్యకాస ఆధ్వర్యాన ఏలూరు రేంజర్ ఆఫీస్ వద్ద ధర్నా



వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో వన సంరక్షణ సమితుల్లో పని చేస్తున్న పేదల సమస్యలు పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, అటవీ ప్రాంత పేదలు, వన సంరక్షణ సమితుల సమాఖ్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా రేంజర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు తోచిలకరాయుడుపాలెం, కొత్తపల్లి, ఉంగుటూరు, గొల్లగూడెం తదితర గ్రామాల నుండి విఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు విచ్చేశారు. విఎస్-ఎస్‌ల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏలూరు రేంజర్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో అటవీ ప్రాంతాల్లో ఉన్న పేదలు, దళితులు అటవీ భూములను గత 25 ఏళ్ల నుండి సాగు చేసుకుంటూ, జామాయిలు, వెదురు వివిధ రకాల పంటలు వేస్తున్నారని తెలిపారు. జామాయిల్ పంట విస్తారంగా వేస్తున్నారన్నారు. విఎస్ఎస్ రూల్స్ ప్రకారం ఐదు నుండి ఏడు ఏళ్ల మధ్య వచ్చిన పంటను కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని ఉండగా ఏళ్ల తరబడి విఎస్ఎస్‌లకు అటవీశాఖ అధికారులు కటింగ్ ఆర్డర్లు ఇవ్వడం లేదన్నారు. పైగా ఉన్న విఎస్ఎస్‌లను ఎత్తివేసేలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అటవీ ప్రాంతంలో పేదలకు వ్యవసాయ పనులు లేని నేపథ్యంలో వన సంరక్షణ సమితులు పేదలకు అండగా ఉంటున్నాయని, వాటిలో వివిధ రకాల పంటలు వేసుకుని పండిస్తున్నారని తెలిపారు. ఈ పంటల సాగుకు అవసరమైన నిబంధనలు అటవీ శాఖ ఇస్తుందన్నారు. వాటిని అమలు చేయాల్సిన అధికారుల సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. తోచిలక రాయుడుపాలెం విఎస్ఎస్‌ను ఆన్‌లైన్‌లోనే లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. కొత్తపల్లి విఎస్ఎస్‌లో జామాయిల్ కటింగ్‌కు వచ్చి ఐదేళ్లు దాటినా నేటికీ కటింగ్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. గొల్లగూడెం విఎస్ఎస్‌లో 6.30 హెక్టార్ల జామాయిల్ కటింగ్ ఉందని తెలిపారు. ఎర్రమళ్ల, చిన్న వెల్లమిల్లి, పెద్ద వెల్లమిల్లి గ్రామాల్లో పని చేసిన కూలీలకు వేతనాలు నేటికీ ఇవ్వలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉంగుటూరులో కటింగ్ చేసి సంవత్సరం గడుస్తున్నా నేటికీ షేర్ అమౌంట్ పేదలకు, వ్యవసాయ కూలీలకు, విఎస్ఎస్ సభ్యులకు ఇవ్వలేదని, ఆ సొమ్ము వెంటనే ఇవ్వాలని కోరారు. జిల్లా అటవీ శాఖాధికారులు జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో జిల్లాలోని అన్ని విఎస్ఎస్ సభ్యులను కదిలించి ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతావని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విఎస్ఎస్ సభ్యులు జయరాజు, అంజయ్య, ప్రసాద్, కనకరాజు, కృపా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబూరావు, దాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును తిరస్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లింగరాజు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమాన్ని తిరస్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో మండల శాఖ సమావేశం మంగళవారం కట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లింగరాజు స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ గోడపత్రికలను ఇతర సహచరులతో కలిసి విడుదల చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ, పారిశ్రామికవేత్త ఆదానీలకు అనుకూలంగా అప్పటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపుకు అనుకూలంగా వ్యవహరించిందని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ దానిని వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేశారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల బిగింపు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల విద్యుత్ వినియోగదారులపై భారాలు పెరుగుతాయని, ఇదే క్రమంలో స్మార్ట్ మీటర్ల బిగింపును తిరస్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, నాయకులు పి.నాగరాజు, టి.రత్తయ్య, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ మిగులు భూములు స్వాధీనం చేసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ

మాట్లాడుతున్న తెల్లం రామకృష్ణ, తదితరులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద కొనుగోలు చేసిన ప్రభుత్వ మిగులు భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ భూముల్లో కొంతమంది వ్యక్తులు పెత్తనం చెలాయించడం చాలా బాధాకరమని అన్నారు. గిరిజనులు తమ బతుకుదెరువు కోసం ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటుంటే దౌర్జన్యంగా గిరిజనులపై కేసులు బనాయిస్తారు కానీ ప్రభుత్వ భూములపై పెత్తనం చలాయిస్తూ ఆ భూములను ఇతర వ్యక్తులకు కౌలుకు ఇస్తున్న సంబంధిత అధికారులు మాత్రం ఎందుకు అటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న కాలంలో ఈ సమస్యపై పెద్ద ఎత్తున ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, చిట్టి బొమ్మ కొండలరావు, గంగరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు కనీస వేతనం ఇవ్వాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధి హామీ పనుల నిర్వహణకు కనీస వేతనం ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని తాడేపల్లి, చొప్పరమెట్ల, చిన్నాగిరిపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద చేపడుతున్న పశువుల నీటితొట్టెలు, పశువుల షెడ్లు, నీటి కుంతలు, మామిడి, గులాబీ తోటలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుబ్బారావు, డిపిఒ కె.అనూరాధ, ఎంపిడిఒ బి.భార్గవి, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి మీనాక్షి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

ఎంఇఒ బి.రాముడు



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని జంగారెడ్డిగూడెం ఎంఇఒ బి.రాముడు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఈమేరకు ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

చిట్ - చాట్

ప్రశ్న : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?

ఎంఇఒ : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో 72 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 7,265 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రశ్న : ఈనెల 12వ తేదీన పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు వచ్చాయా?

ఎంఇఒ : 95 శాతం పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగులు వచ్చాయి.

ప్రశ్న : గత ప్రభుత్వంలో నాడు-నేడులో ఎన్ని పాఠశాలలు ఎంపికయ్యాయి? ఆ పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయా?

ఎంఇఒ : నాడు-నేడులో జంగారెడ్డిగూడెం మండలంలో 56 పాఠశాలలు ఎంపికయ్యాయి. కొన్ని పాఠశాలల్లో పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రస్తుత ప్రభుత్వానికి ఆ పాఠశాలల ఊసే లేదు.

ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు ఎలా నడుస్తున్నాయి? ఇంగ్లీష్ మీడియం ఏవిధంగా బోధిస్తున్నారు?

ఎంఇఒ : ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ క్లాసులు కూడా చెబుతున్నాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా చాలా బాగా ఇంగ్లీష్ నేర్చుకుంటున్నారు.

ప్రశ్న : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో ఎన్ని ప్రయివేట్ విద్యాసంస్థలు నడుస్తున్నాయి?

ఎంఇఒ : జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో 42 ప్రయివేట్ విద్యా సంస్థలు నడుస్తున్నాయి.

ప్రశ్న : ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు ఏమైనా మూసివేశారా?

ఎంఇఒ : ఈ ఏడాది మండలంలో ఏ పాఠశాల కూడా మూసివేయలేదు. గతేడాది మండలంలో వెంకటరామానుజపురం గ్రామంలో ఒక పాఠశాల మూసివేశారు.

ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయడానికి ఏవిధమైన కృషి చేస్తున్నారు?

ఎంఇఒ : ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయడానికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

ఉపాధి పనులకు కనీస వేతనం ఇవ్వాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధి హామీ పనుల నిర్వహణకు కనీస వేతనం ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని తాడేపల్లి, చొప్పరమెట్ల, చిన్నాగిరిపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం కింద చేపడుతున్న పశువుల నీటితొట్టెలు, పశువుల షెడ్లు, నీటి కుంతలు, మామిడి, గులాబీ తోటలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుబ్బారావు, డిపిఒ కె.అనూరాధ, ఎంపిడిఒ బి.భార్గవి, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి మీనాక్షి పాల్గొన్నారు.

ఘనంగా వట్టి వసంతకుమార్ జయంతి

రోగులకు పండ్లు, పౌష్టికాహారం పంపిణీ

భీమడోలు : ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ మంత్రి, ఉంగుటూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ వట్టి వసంత కుమార్ జయంతి కార్యక్రమాలను ఆయన అభిమానులు మండలంలో మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఇన్ పేషెంట్లకు పండ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వర్ధినీడి సత్యసాయి, కె.లక్ష్మణ్, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు డాక్టర్ రశ్మి పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

జిల్లా ఇన్‌ఛార్జి సత్యం

దెందులూరు : జిల్లాలోని గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేసి జులై 7వ తేదీన ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌ఛార్జి సత్యం పిలుపునిచ్చారు. జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ నాయకులు, జిల్లా ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి కూచిపూడి సత్యం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. అడ్వకేట్స్ పింగుల భద్రం, మట్టా విద్యార్థి, ఎస్.గంగాధర్, ఎన్.రాము, ఇ.సాగర్, లాయర్లు, ఏలూరు కు చెందిన ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కాశీ కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలం కేటాయించాలని ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చింతలపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కి సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు బోడ వజ్రం, ముల్లగిరి లాజర్, అలెగ్జాండర్ తాడిగడప మాణిక్యాలరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జంపన వెంకటరమణ రాజు, టి.ఆంజనేయరాజు పాల్గొన్నారు.

టి.నరసాపురం : రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) మండల కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ టి.సాయిబాబాకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరంకి వెంకట్రావు, పులి సత్యనారాయణ, చమట పాము బాలశౌరి, కె.రాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సరిహద్దు వివాదంతో ఇరువురు దాడి

తీవ్రగాయాలతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు నగరంలో పట్టపగలు నడిరోడ్డు మీద పాత ఘర్షణలు బగ్గుమున్నాయి. రెండు తరగతుల మధ్య చెలరేగిన ఈ ఘర్షణలో ఒకరిపై ఒకరు రాడ్లు, కత్తులతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో తీవ్రగాయాల పాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ ఉన్నాడు. కోటదెబ్బ ప్రాంతానికి చెందిన తోట వెంకటరావు కుటుంబానికి నక్క అంజిబాబు కుటుంబానికి మధ్య సరిహద్దు తగదా గత మూడేళ్ల క్రితం మొదలైంది. అయితే వీరిరువురు ఒకరిపై ఒకరు సరిహద్దు తగాదా నిమిత్తం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేసుకున్నారు. అప్పటినుంచి వీరి తగువు కోర్టు వాయిదాలో ఉంది. ఈ క్రమంలో తోట వెంకటరావు, నక్క అంజిబాబులు ఇద్దరు ఒకరికొకరు మంగళవారం ఉదయం ఎదురుపడ్డారు. తోట వెంకటరావుతోపాటు అతని బంధువు నాగరాజు కలిసి ఉండగా నక్క అంజిబాబు నాగరాజుపై దాడి చేశాడు దీంతో అతనికి గాయాలయ్యాయి. ఈ ఘర్షణలో అంజిబాబు కూడా గాయాలయ్యాయి. వీరిరువురు చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజనాస్పత్రికి వెళ్లారు. అనంతరం ఖగ్గా వెంకటేశ్వరరావు తోడల్లుడు బాలాజీ కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి వెళ్లారు. అదే సమయంలో నాగరాజు, ఖగ్గా వెంకటేశ్వరరావులు ఒకరిపై ఒకరు రాడ్డుతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు తలపై బలమైన గాయమైంది. ఖగ్గ వెంకటేశ్వరరావు తోడల్లుడు, కుమారుడు బాలాజీ, తోట వెంకటేశ్వరరావు కుమారుడు, బంధువు దావీదు రాజుపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయమైంది. ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సమీపంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు, సిబ్బంది కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు దావీదు రాజును మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వెంకటేశ్వరరావు చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్..!

20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

పంచాయతీ తీరుపై విమర్శల వెల్లువ

స్థలాలు మెరక చేయించి తమకే కేటాయించాలని వేడుకోలు

ఇళ్ల స్థలాల్లో దట్టంగా పెరిగిన జనుము

ప్రజాశక్తి - మండవల్లి

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. కామన్ సైట్‌ను పోలీస్ స్టేషన్‌కు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం 130 మంది లబ్ధిదారుల ఆశలను అడియాసలు చేసిందనే విమర్శలున్నాయి. 20 ఏళ్ల నుంచి మెరక చేస్తారు.. పట్టాలు ఇస్తారు అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసినప్పటికీ పట్టించుకోకుండా పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించడంపై పంచాయతీ తీరుపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ స్థలాల్లో గూడు కట్టుకుందామని ఎన్నో కలలు కన్నామని విధి వెక్కిరించి భర్తలను, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిపోయామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచి, కార్యదర్శి తీసుకున్న నిర్ణయంతో స్థలాలు ఇక దక్కుతాయనే ఆశలు కూడా సన్నగిల్లిపోతున్నాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పేదవాడి సొంత ఇంటి కలగానే, పేదవాడు గూడు లేక పేదవాడుగానే మిగిలి పోవాల్సిందేనా అంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మాపై దయ చూపే వారే లేరా అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

బాధితుల కథనం ప్రకారం.. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని పేదలు ఎవరు ఉండకూడదనే లక్ష్యంతో ఇందిరమ్మ స్థలాలు, ఇందిరమ్మ గృహాలు అనే పథకాన్ని తీసుకువచ్చింది. మండవల్లిలో ఇళ్లు లేని 130 మందిని గుర్తించి వారికి స్థలం కేటాయించే విధంగా తరుగుమూల ఉన్న పొలాలను ఎకరా రూ.2 లక్షల 65 వేల చొప్పున 4 ఎకరాల 10 సెంట్లు భూమిని అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్లాట్లు వేసి లబ్ధిదారుల సౌకర్యార్థం బడి, గుడి, కమ్యూనిటీ హాలు, మంచినీటి అవసరాలు, పార్క్, అంగన్వాడీ ఏర్పాటు చేసుకునే విధంగా 40 సెంట్ల కామన్ సైట్ ను కూడా కేటాయించారు. వెంటనే గృహాలు నిర్మించే విధంగా లబ్ధిదారుల పట్టాలను గృహనిర్మాణ శాఖకు అప్పగించారు. అప్పటి నుంచి పట్టాలన్నా ఇవ్వండి.. మెరకైనా చేయండి అంటూ అధికారుల చుట్టూ 20 సంవత్సరాలు ప్రదక్షిణాలు చేసినా స్థలాల వైపు ఎవరూ కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇప్పుడు అదే స్థలాన్ని అధికారులు పోలీస్ స్టేషన్‌కు కేటాయించడంతో ఎలా కేటాయిస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఇల్లు నిర్మించుకునేలా చేస్తానని హామీ ఇచ్చి ఎన్నికల సమయంలో జేబులు నింపుకుని ఇప్పుడు కనిపించకుండా పోయిన నాయకులు కూడా ఉన్నారు. 20 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో కుటుం బాలలో పెను మార్పులు జరిగి భర్తలను పోగొట్టుకొని, బిడ్డలను కోల్పోయి అనాథలుగా మిగిలిపోయామని మహిళలు కన్నీటి పర్యంతమవుతున్నారు. సొంతిల్లు ఉంటే ఎలాగోలా బతికే వారమని ఈ వయసులో అద్దె ఇళ్లకు అద్దెలు కట్టలేక బతుకు భారమై ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని చెప్తున్నారు. ఇప్పటికైనా లబ్ధిదారుల ఆవేదనను అర్థం చేసుకొని లబ్ధిదారుల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు ఉపసంహరించుకోవాలని, స్థలాలను మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను లబ్ధిదారులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

అనాథనైపోయాను.. ఆదుకోండి

చిగురుపాటి చింతామణి

స్థలాలు పంపిణీ చేసినప్పుడు చాలా సంతోషపడ్డాను. చిన్న ఇళ్లైనా వేసుకుందాం అనుకున్నాము. 20 ఏళ్లు అయిపోయింది. నా భర్త, కొడుకు చనిపోయారు. ఒంటరిగా ఉంటున్నాను. ఇల్లు లేకపోవడంతో ఆ పంచన, ఈ పంచన చేరి బతుకుతున్నాను.

తిరిగి తిరిగి అలసిపోయాను

నల్లపోతుల లక్ష్మి

ఇంటి స్థలం కోసం తిరిగి, తిరిగి అలసిపోయాను. స్థలం ఇవ్వలేదు. నా భర్త చనిపోయాడు. ఎవరిని అడగాలో తెలియదు. అసలు ఇస్తారో లేదో తెలియడం లేదు.

ఇంటి కోసం ఎంతో తపన పడ్డాం

సుంకర బుజ్జమ్మ

ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలంలోనే తగిన రీతిలో ఇల్లు కట్టుకుని జీవించాలని నా భర్త, నేను ఎన్నో కలలు కన్నాము. స్థలాలు ఇచ్చి 20 ఏళ్లయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇళ్ల స్థలం మెరక చేయాలని అధికారులు చుట్టూ తిరిగాం ఎవరూ పట్టించుకోలేదు. సొంత ఇంటి కల నెరవేరకుండానే నా భర్త చనిపోయాడు.

అద్దె కట్టలేక అవస్థలు పడుతున్నా..

వెంకటేశ్వరమ్మ



ఇల్లు నిర్మించుకుంటాను పట్టా ఇవ్వమని అధికారుల చుట్టూ తిరిగాను. ఏ అధికారి కనుకరించలేదు. నా భర్త చనిపోయాడు. కూతుళ్లకు పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపించి అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఒంటరి దాన్ని అద్దె కట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నాను. నాలుగు ఇళ్లల్లో పాచి పని చేసుకుని బతుకుతున్నాను.

కాలువ గట్టు మీద ఉంటున్నాం

కోట మాణిక్యం

నాకు ప్రభుత్వం స్థలం ఇచ్చింది అనగానే మురిసిపోయాను. ఇల్లు వేసుకుని ఎలాగైనా బతకొచ్చులే అనుకున్నాను. పెద్ద కొడుకు తన కుటుంబంతో వేరే ప్రాంతంలో ఉంటున్నాడు. రెండవ కుమారుడు మధ్య సంబంధం లేదు. మూడవ కుమారుడు ట్రైన్ ఆక్సిడెంట్‌లో చనిపోయాడు. ఇద్దరం ముసలి వాళ్లం అయిపోయాం. కాలువ గట్టున పాక వేసుకుని జీవిస్తున్నాం.

విద్య ఆధారంగా స్వయం ఉపాధి పొందాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్య ఆధారంగా యుక్తవయసులైన బాలికలు స్వయం ఉపాధి, ఉద్యోగ సాధనకు కృషిచేయాలని, కుటుంబాలకు అండగా నిలవాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు పరిధిలో కిశోరి వికాసం 2.0 ముగింపు కార్యక్రమం మంగళవారం గుండుగొలను అంగన్వాడీ కేంద్రం నెంబర్-23 వేదికగా నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త బి.రాజామణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గుండుగొలను సెక్టార్ పర్యవేక్షకులు ఎం.కవిత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా భీమడోలు ఎంపిడిఒతో పాటు, కూటమి నాయకులు కొండబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ, బాలల సంరక్షణ కార్యాలయ అధికారి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సెల్ఫోన్ వినియోగం వల్ల కలిగే మంచి, చెడు అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో సుమారు వందమంది వరకు యుక్త వయష్కులైన బాలికలు పాల్గొన్నారు.

కిశోరి వికాసం 2.0 ముగింపు కార్యక్రమం

భీమడోలు : మాట్లాడుతున్న ఎంపిడిఒ పద్మావతి

ఏలూరు సిటీ : ఏలూరులోని గాంధీనగర్ మున్సిపల్ హై స్కూల్‌లో మంగళవారం కిశోరి వికాసం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉభయగోదావరి జిల్లా ఆర్‌జెడి సుజాత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుజాత మాట్లాడుతూ మే రెండో తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా కిశోర్ బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, బాల్యవివాహాలు, వ్యాయామం, క్రీడలు, పోక్సో చట్టం గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీడీ శారద, డిసిపిఒ సూర్య చక్రవేణి, సిడిపిఒ విజయలక్ష్మి, ఇఒ మల్లిక, సూపర్వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎఎస్‌పి సూర్యచంద్రరావుకు బుకె అందజేస్తున్న ఉర్ల శ్రీనివాస్

ఘనంగా ఫుడ్ ఇంజనీర్స్ మూడో వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ ప్రతిఒక్కరి ఆదరాభిమానాలు పొందుతున్న ఫుడ్ ఇంజనీర్స్ రెస్టారెంట్ మూడో వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషకరమైన విషయమని జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక జిల్లా కోర్టు సెంటర్లో ఫుడ్ ఇంజనీర్స్ పేరుతో రెస్టారెంట్ మూడో వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఎఎస్‌పి సూర్యచంద్రరావు, సమాచార శాఖ ఎడి రామచంద్రరావు విచ్చేసి మాట్లాడారు.. అనంతరం మూడో వార్షికోత్సవ కేక్‌ను కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, సిఐలు సుబ్బారావు, కోటేశ్వరరావు, అశోక్‌కుమార్, ఎస్ఐలు మదీనా భాషా, క్రాంతిప్రియ, మధు వెంకట రాజా, నరేంద్ర, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వామి జగదీష్ బాబు, పలువురు సిఐలు, ఎస్ఐలు, రెస్టారెంట్ యజమాని ఉర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా

ముసునూరు : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ఇకపై సన్నబియ్యంతో తయారు చేసినటువంటి ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్.సుబ్బారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముసునూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12 నుంచి పాఠశాలలు పున్హ ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా అన్ని పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలోని 61 పాఠశాలలకు 25 కిలోల బ్యాగులు సన్నబియ్యం, కిలో చొప్పున రాగి, బెల్లం ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులకు ముందస్తు సమాచారం ఇచ్చి వాటిని తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. జూన్ నెలకి సరిపడా బియ్యం నూజివీడు డివిజన్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ప్రత్యేక వాహనంలో మండలంలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేసినట్లు తెలిపారు .

మహిళలను కించపరచిన వారిని కఠినంగా శిక్షించాలి : టిడిపి

ఉంగుటూరు : అమరావతి ప్రాంతాల్లో మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచి అసభ్య పదజాలంతో వర్ణించిన వ్యక్తులు, మీడియా ఛానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. నియోజకర్గం నలుమూలల నుంచి కూటమి మహిళా నాయకులు, కార్యకర్తలు, గృహిణిలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ సాక్షి టివిలో డిబేటింగ్ చేస్తూ మహిళలను వేశ్యలుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, సంబంధిత మీడియాను బేన్ చేసి నిందితులను శిక్షించాలని నినాదాలు, ప్లేకార్డులో స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి పాదయాత్ర చేసుకుంటూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తహశీల్దార్ రవికుమార్‌కు వినతిని అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ధర్నాని ఉద్దేశించి సిఐటియు డివిజన్ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. బీమా, అలవెన్సులు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అందించాలని కోరారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి స్మృతులను గుర్తు చేసుకుని నెమరు వేసుకున్నారు. ఆ సమయంలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా పలకరించుకున్నారు. చదివిన పాఠశాలకు ఎంతో కొంత ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఒకరికొకరు మాట్లాడుకోవటంతో పాటు మనం కూడా ఏదైనా ఇబ్బందులు వచ్చిన సమయంలో ఒకరినొకరు ఆర్థిక సహాయం చేసుకోవాలని అనుకున్నారు. ప్రధానోపాధ్యాయులు దీవనమ్మ, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మి, డిఆర్‌కె.ప్రసాద్, పూర్వ విద్యార్థులైన పి.శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, తోర్లపాటి శ్రీను, ఆబోరుసు బాలు, నవీన్, పల్లి పాము రమ్య పాల్గొన్నారు.

బాలబాలికల రక్షణ, ఆహార విషయాల్లో జాగ్రత్తలు తీసుకోండి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రికార్డులు పరిశీలిస్తున్న రత్నప్రసాద్

బాలబాలికల రక్షణ, ఆహార విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక విద్యానగర్‌లోని శిశుగృహాన్ని సందర్శించారు. శిశు గృహంలోని బాలబాలికల ఆరోగ్య విషయాలను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలబాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, ఉన్నత శిఖరాలకు చేరేలా సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఆదేశించారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శిశుగృహ మేనేజర్ కె.భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా జీవన విధానంగా మార్చుకోవాలి : జెసి

ప్రజాశక్తి - ఏలూరు, జంగారెడ్డిగూడెం

యోగా నిరంతర ప్రక్రియ అని, ఆరోగ్యంగా ఉండటానికి ప్రతిఒక్కరూ యోగా జీవన విధానంగా మార్చుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జంగారెడ్డిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద మంగళవారం యోగాంధ్ర అభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెసి మాట్లాడుతూ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో యోగాంధ్ర అభ్యాసన కార్యక్రమం సందడిగా, ప్రశాంతగా జరిగిందన్నారు. పర్యాటక ప్రాంతాలలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుట వల్ల అంతర్జాతీయ గుర్తింపు, మంచి స్ఫూర్తి కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని అన్నారు. యోగా ఆసనాలు ఒక్కరోజు కార్యక్రమం కాదని నిరంతర ప్రక్రియ అని, ప్రతి రోజు ఉదయం అరగంట సమయం కేటాయించి సాధన చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్, ఆర్‌డిఒ ఎవి.రమణ, ఐటిడిఎ పిఒ కె.రాములు నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన పిలుపుమేరకు యోగా దినోత్సవాల సందర్భంగా ముదినేపల్లి, అల్లూరు గ్రామాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా పట్ల అవగాహన, యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, దావు నాగరాజు, ఎన్‌డియే కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంగా భాస్కర్ రావు బాధ్యతలు

నూజివీడు టౌన్ : మండలంలోని మద్దాయికుంట ఎంపి యూపి పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా దారపురెడ్డి భాస్కరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రేపల్లె జెడ్‌పి హైస్కూల్ నుంచి భాస్కరరావు బదిలీపై రావడం జరిగింది. హెచ్‌ఎం భాస్కర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతం పెంపు దిశగా కృషి చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు

వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసర సరితా రెడ్డి

ఏలూరు సిటీ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసర సరితా రెడ్డి మండిపడ్డారు. ఏలూరులోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సరిత రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ అధ్యక్షులు సాయిలు స్వాతి యాదవ్, వైసిపి రాష్ట్ర సెక్రెటరీ జయలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ డిపో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న రేషన్ డిపోను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించి, డీలర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సకాలంలో రేషన్ పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

జీలుగుమిల్లి : ఏజెన్సీ గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బంది రాకుండా ఉండేందుకు వాటర్ ట్యాంక్‌లను నిర్మిస్తున్నట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.29.7 లక్షల నిధులతో మండలంలోని జిల్లెళ్లగూడెం గ్రామంలో తాగునీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి కష్టాలు లేకుండా ప్రజలకు సురక్ష తాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వినయ్, జనసేన మండల అధ్యక్షులు పి.రాము, సర్పంచి సున్నం వరలక్ష్మీ, ఎంపిటిసి ఉదయ్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా ప్రియాంక బాధ్యతలు

ముదినేపల్లి: ముదినేపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బి.ప్రియాంక మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రియాంక తాడంకి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా ముదినేపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

జిల్లా పరిషత్ సిబ్బంది బదిలీ

ఏలూరు సిటీ: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో పనిచేస్తున్న జిల్లా పరిషత్ సిబ్బంది బదిలీలను క్యాడర్ వారీగా నిర్వహించారు. ఈ బదిలీలలో అర్హత ప్రమాణాలు, పరిపాలన అవసరాల మేరకు చేపట్టబడ్డాయని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంట పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. ఈ బదిలీలలో ఎంపిడిఒలు ఒకరు, అకౌంట్ అధికారులు 9 మంది, సీనియర్ అసిస్టెంట్లు 19, జూనియర్ అసిస్టెంట్లు 31, టైపిస్టులు ఐదు, రికార్డ్ అసిస్టెంట్లు 30, లైబ్రరీ లేబర్ అసిస్టెంట్లు 12, ఆఫీస్ సబార్డినేట్ అయిదు పోస్టులు బదిలీ చేశారు. ఈ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా, సుదీర్ఘకాలంగా ఒకే స్థానంలో కొనసాగుతున్న ఉద్యోగుల సేవలను మరోచోట వినియోగించుకునే అభ్యర్థులతో నిర్వహించడం జరిగిందని అన్నారు.

దెందులూరు డిటిగా అంతర్వేది

దెందులూరు: దెందులూరు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా అంతర్వేది శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈయన ఏలూరు రూరల్ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ఎస్‌పిచే పోలీస్ స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐకు స్థానిక సిబ్బందికి ప్రజల పట్ల అన్యోన్యతగా ఉండాలని, వారికి ఎటువంటి ఇబ్బంది కలిగించకూడదని, కేసుల విషయాల్లో కూడా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో కుక్కునూరు సిఐ రమేష్ బాబు, జీలుగుమిల్లి సిఐ స్థానిక ఎస్ఐ నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయ భవనంలో పెట్రోల్‌తో దాడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని నరసింహారావుపేటలోని సాక్షి కార్యాలయం ఉన్న భవనంలో ఉన్న సోఫాలకు పెట్రోల్ పోసి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. ఫైర్ పోలీసులు ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పి వేశారు. సాక్షి కార్యాలయాన్ని తగలబెట్టడానికి వచ్చి ఆఫీస్ మొదటి అంతస్తులో ఉండడంతో సమాచారం తెలియక గ్రౌండ్ ఫ్లోర్లో తగలబెట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆ ఇంటిలో అద్దెకు ఉంటున్న వారు ఏదైనా ఉంటే సరైన సమాచారం తెలుసుకొని కార్యాలయంపై దాడి చేయాలి కానీ ఎవరి ఇంటి సామాన్లపై, ఎవరి ఇంటిపై దాడి చేస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.